# ఆడవాళ్ళంటే నాకు.... అపరిమితమయిన భయం!

యన్. బి. యస్. రామయ్యంగార్

ఆనాడు కాలేజిలో డిబేటు ఉండెను. సాయంత్రం 5-30 కి డిబేటు మొదలెట్టడం మా కాలేజిలో అలవాటు. ఒక డజనో, డజనున్నరో మాట్లాడే వారుంటారు అందుచేత డిబేటు పూర్తయేసరికి 9-30 అవడం మామూలు. ఆనాడు అబ్జర్వరుగా వచ్చిన పెద్దమనిషి చాటుగా వెళ్ళి చెవులు నులుపుకొని మరెప్పుడూ ఇలాంటి ఉద్యోగానికి ఒప్పుకోకూడదని ఒట్టుపెట్టుకోవడంకూడ మామూలే!

మా యిల్లు కాలేజికి చాలదూరం, అందుచేత నాపేరు మొదటి ముగ్గురిలో వేయించుకోవడం, నా ఛాన్సు అయిపోయాక మెల్లగా జారుకోవడం ఒకవిధంగా అలవాటయిపోయిందనే చెప్పుకోవాలి

నా ఛాన్సు అయిపోయింది. నా తరువాత ఆయన మాట్లాడుతున్నాడు, నేను ప్రక్క-ద్వారం లోంచి బయటపడ్డాను.

పగలంతా వాన కురిసింది. రోడ్లు బురదతో నిండి ఉన్నాయి. మ్యునిసిపాలిటీవారి ధర్మాన రోడ్డుమీద చిన్న చెరువులు తయారయ్యాయి. చీకటిపడింది. ఎలక్ట్రిక్ లైట్లు వెలుగుతున్నా స్తంభాని స్తంభానికి మధ్య చీకటి తప్పలేదు.

నేను వెళ్ళే రోడ్డమీద ఇళ్ళూ తక్కువే, జన సంచారం తక్కువే. సగందూరం పోయేసరికి చినుకులు పడటం ప్రారంభించింది. నా అదృష్ట వశాత్తు దగ్గరగా ఒక యిల్లుంది. దాని అరుగెక్కిపోయాను, రాత్రయిపోతున్నది. వాన వెలిసే సూచనలు కనబడ్డంలేదు. ఎలాగా ? అప్పుడే మా నాన్నగారు గాభరాపడుతుంటారు. పైగా ఆకలేస్తోంది.

ఈలోగా ప్రక్కనుంచి ఒకాయన గొడుగు వేసుకొని వస్తున్నాడు. తెల్లని పైజామా (కొద్ది బురద మరకలు తప్పించి) తెల్లటి లాల్చి, కాళ్ళకి జోళ్ళు, ఒకచేత్తో గొడుగు పట్టుకున్నాడు. రెండో చేతిని రిష్టువాచిమాత్రం ఉండుండి తళుక్కున మెరుస్తున్నది. ఎలెక్ట్రిక్ దీపంకాంతి ముఖంమీద పడకుండా, ముఖం యేంటి, మోచేతులవరకూ గొడుగు అడ్డుతున్నది.

నా అనుభవంవల్ల తెలిసికొన్నదేమంటే, యెవరికైనా మీ గొడుగులోకి వచ్చేదా అంటే రావద్దంటారు. కాని దబాయించి దూరిపోయి చిన్న క్షమాపణ చెప్పేస్తే మొదట చికాకుపడినా ఊరుకుంటారు.

ఆ యింటి అరుగుదగ్గర్నుంచి పోతున్నప్పుడు మెల్లిగా గొడుగులో దూరేను. ఆయనేం అనలేదు. అసలు నేను చాల పొట్టిగా ఉంటాను కాబట్టి గొడుగు ఎవరు పట్టుకున్నా నాకు ఇబ్బంది ఉండదు. అందుచేత అతి జాగ్రత్తగా క్రిందికి చూచుకుంటూ బురదనీళ్లు తప్పుకొంటూ ఒక ఫర్లాంగు నడిచాం.

"మీరిలా యెంతదూరం వెళతారు" నేను అడిగాను.

సమాధానం లేదు.

నాకు చాల కోపంవచ్చింది నాకీయన యెందుకు జవాబుచెప్పడంలేదు. పరాకుగా ఉన్నాడేమో ? లేక ఈ ఊరువాడు కాదా ? ఎదురుగా ఒక కారు వస్తున్నది. దాని దీపకాంతిలో అతని ముఖంలోకి చూశా.

బాబోయ్ !!!

అతను మొగాడు కాదు. ఎవరో పంజాబీ అమ్మాయి! పైజామా లాల్చి చూసి మొగాడనుకున్నాను. గుండె ఆగిపోయింది. అంతే కాళ్లకి బుద్ధిచెప్పాను.

మా యింటికి పదిగజాల దూరంలోఉన్న బురదలో జారిపడిందాకా మరి వెనక్కి తిరిగి చూడలేదు.

నాకు ఆడవాళ్ళంటే అపరిమితమైన భయం.